సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 8 । జనవరి । 2025



కడప, నెల్లూరు జట్ల విజయం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-12 క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. - IIలో



ఘనంగా సిల్వర్ జూబ్లీ ఉత్సవాల ప్రారంభం

ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏయూ క్యాంపస్ ఆవరణలో అత్యంత సుందరంగా వేదికను నిర్మించారు. - IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.2 /18.4

జిల్లాలో మంగళవారం 18.4 – 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న సదస్సులు

కడప సెవెన్‌రోడ్స్ : భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగియనున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. చివరిరోజు జిల్లాలో 17 గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని అట్లూరు మండలం కొండూరు, కలసపాడు మండలం రెడ్డిపల్లి, కాశినాయన మండలం సావిసెట్టిపల్లి, పోరుమామిళ్ల మండలం మిద్దపాడు, చెన్నకృష్ణాపురం, పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం గండికొవ్వూరు, లింగాల మండలం పార్నపల్లె, సింహాద్రిపురం, పులివెందుల మండలం రాగిమానిపల్లిలో సదస్సులు జరుగుతాయని వివరించారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్‌లోని మైలవరం మండలం లింగాపురం, పెద్దముడియం మండలం పాలూరు, కొండాపురం మండలం వెంకయ్యకాల్వ, జమ్మలమడుగు మండలం పొన్నతోట, ముద్దనూరు మండలం యామవరం, దువ్వూరు మండలం చింతకుంట, చాపాడు మండలం అల్లాడుపల్లె, కడప రెవెన్యూ డివిజన్‌లోని కమలాపురంలో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయని డీఆర్వో తెలిపారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన బీసీ అభ్యర్థులు స్వయం ఉపాధి పథకంలో భాగంగా బ్యాంకు లింకేజీ కింద రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహా తెలిపారు. ఒక యూనిట్ విలువ రూ. 5 లక్షల్లోపు రుణాలకు సంబంధించి బీసీ కార్పొరేషన్ పరిధిలో 1550, ఈబీసీ కింద 74, కమ్మ కార్పొరేషన్ 27, రెడ్డి కార్పొరేషన్ 98, ఆర్యవైశ్య కార్పొరేషన్ 17, క్షత్రియ కార్పొరేషన్ 16, బ్రాహ్మణ కార్పొరేషన్ 8, కాపు కార్పొరేషన్ 379, కాపు ఎంఎస్ఈ గ్రూప్‌లోన్ కింద మూడు యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అలాగే జనరిక్ మెడికల్ షాపు కింద యూనిట్ విలువ రూ. 8 లక్షలకుగాను బీసీలకు 32, ఈబీసీలకు 14, కమ్మలకు 4, రెడ్డి కార్పొరేషన్‌కు 16, ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు 3, క్షత్రియ కార్పొరేషన్‌కు 3, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు 1 యూనిట్ ఉంది. మొత్తం 2245 యూనిట్లను 2245 మంది అభ్యర్థులకు అందజేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను అర్హత గల వారు ఆధార్, రేషన్‌కార్డులు, ఆదాయ ధ్రువీకరణ, కుల సర్టిఫికెట్‌తోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హెచ్ఎంపీవీపై ఆందోళన వద్దు

– డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : హెచ్ఎంపీవీ (హ్యూమన్ మేటా న్యూ వైరస్)పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ వైరస్ జిల్లాతో పాటు రాష్ట్రంలో మరెక్కడా లేదన్నారు. కోవిడ్ వైరస్ తరహాలోనే ఈ వైరస్ కూడా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని తెలిపారు. వైరస్ సోకిన వ్యక్తుల నుంచి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా, వారితో సన్నిహితంగా మెలగటం, కరచాలనం, స్పర్శ వంటి చర్యల ద్వారా ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వైరస్ సోకిన మూడు నుంచి 10 రోజులలోగా లక్షణాలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు. వైరస్ సోకిన వారిలో కొన్ని మార్లు నిమోనియా, బ్రాంకైటీస్ లాంటి శ్వాసకోశ సమస్యలు ఉంటాయని పేర్కొన్నారు. హెచ్ఎంపీవీ వైరస్‌కు అడ్డుకట్ట వేయాలంటే కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలను పాటించాలని పేర్కొన్నారు.


మామిడిపై పగమంచు!

- జాడ కనిపించని మామిడి పూత!
- జిల్లావ్యాప్తంగా 13వేల హెక్టార్లలో మామిడి సాగు
- వాతావరణ మార్పుతో పూతకు రాని వైనం
- ఎకరాకు రూ.45వేలకుపైగా ఖర్చు
- ఆందోళన చెందుతున్న రైతులు

మామిడి రైతు ఆశల్ని పొగమంచు ఆవిరి చేసేలా ఉంది. నిండుగా పట్టిన పూత చూసి మురిసిపోదామనుకున్న రైతుల కల.. కలగానే మిగిలిపోయేలా ఉంది. దండిగా కాసిన కాయల్ని అమ్మి.. లాభాలు గడించాలన్న వారి ఆశల్ని వాతావరణం గండి కొడుతోంది. అవును.. అకాల వర్షాలతో... వాతావరణంలో మార్పులతో... పొగ మంచు నీడలతో.. చుట్టుముట్టిన చీడ పీడలతో మామిడి చెట్టు పూత లేక బోసిపోయి కనిపిస్తోంది.



వేంపల్లెలో సాగు చేసిన మామిడి తోట
(ఇన్‌సెట్) పూత రాక బోసిపోయిన మామిడి చెట్టు



వేంపల్లె: అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులు, దట్టమైన పొగ మంచు మామిడి రైతులకు శాపంగా మారింది. ఇటీవల నవంబర్, డిసెంబర్ మాసాలలో వరుస తుపాన్ల కారణంగా కురిసిన వర్షాలతో భూమిలో తేమశాతం పెరగడమే కాకుండా వాతావరణంలో మార్పు చోటు చేసుకున్నాయి. ఫలితంగా మామిడి చెట్లకు పూత రావడంలో ఆలస్యం అవడంతో రైతులు కలవరపడుతున్నారు. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో మామిడి పూత వచ్చి, ఫిబ్రవరి, మార్చి నెలలో పిందెలు కాసేవి. కానీ జనవరి నెల వచ్చినా ఇంతవరకు పూత జాడే కనిపించకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు.

13వేల హెక్టార్లలో మామిడి తోటలు

జిల్లా వ్యాప్తంగా సుమారు 13వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. వేసవిలో వచ్చే మామిడి పంట జిల్లాలో 20 మండలాలలో మేజర్ క్రాప్ ఇదే. ఇందులో 65 శాతం తోతాపురి మామిడి రకం సాగు చేస్తున్నారు. దీంతోపాటు నీలం, బేనీషా, ఖాదర్, ఇమాం పసంద్, మల్లికా వంటి రకాలు సాగులో ఉన్నాయి.

మామిడి పూత కోసం రైతులు పాట్లు

మామిడి తోటల్లో అరకొరగా పూసిన పూత ఆపేందుకు ఒకవైపు, కొత్తగా పూత వచ్చేందుకు మరోవైపు రైతులు నానా పాట్లు పడుతున్నారు. దీనికితోడు మామిడి పూత రసం పీల్చే నల్లి, మామిడి పూతను తొలిచే పురుగు మామిడి పంటను ఆశించాయని రైతులు వాపోతున్నారు. ఎకరానికి రూ.45వేల నుంచి రూ.50వేల చొప్పున ఖర్చు చేస్తూ మూడు దఫాలుగా మందులు స్ప్రే చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆశించిన స్థాయిలో అనుకున్న సమయానికి మామిడి పూత వస్తే ఎకరానికి ఐదు టన్నుల మామిడి కాయల దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇంతవరకు మామిడి పూత దశ కనిపించకపోవడంతో ఈ ఏడాది కూడా నష్టపోయే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రైతులు కోలుకోవడం కష్టమవుతుందని ఆవేదన చెందుతున్నారు.

సలహాలు, సూచనలు ఎక్కడ..

ఉద్యాన పంటల సీజన్లలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యాన శాఖ (హార్టికల్చర్) అధికారులు మామిడి తోటలను పట్టించుకోవడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. వచ్చిన మామిడి పూత రాలకుండా కొత్త పూత వచ్చేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అధికారులు అవగాహన కలిగించాల్సి ఉన్నప్పటికీ జిల్లాలో ఆ దశగా చర్యలు ఎక్కడ కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఎక్కడా హార్టికల్చర్ అధికారులు కనిపించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులే సొంతంగా మందులు పిచికారి చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మామిడి తోటలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మందుల కోసం లక్షకు పైగా ఖర్చు చేశా



ఐదెకరాల మామిడి తోటను సాగు చేశాను. ఇప్పటివరకు మామిడి పూత సరిగా రాలేదు. పూత అంతంత మాత్రానే ఉండడంతో మూడు దఫాలుగా మందులు పిచికారి చేసి లక్షకుపైగా ఖర్చు చేశాను. ఇప్పటికే క్లోరీ ఫైర్ పాస్, సాప్ పొడి మందు, మామిడి చెట్లకు కొట్టించా. గత ఏడాది అనుకున్న దిగుబడి రాలేదు. ఈసారైనా లాభాలు వస్తాయనుకుంటే మామిడి పూతే రాలేదు.
– కోనేటి గోపాల్,మామిడి రైతు, వేంపల్లె

ఈపాటికి పూత రావాల్సింది



గతంలో ఈ టయానికల్లా మామిడి చెట్లకు పూత బాగా వచ్చేది. తేమశాతం ఎక్కువ కావడమా లేక వాతావరణ ప్రభావమో తెలియడం లేదుగానీ.. ఇంతవరకు పూత జాడ కనిపించలేదు. గత ఏడాది కూడా ఆశించినస్థాయిలో పూత, దిగుబడి లేక చాలా నష్టపోయాం. ఈ ఏడాది కూడా పూత రాకపోవడంతో ఆందోళనగా ఉంది.
– షేక్ ఇమాం సాహెబ్, మామిడి రైతు, వేంపల్లె

వాతావరణంలో మార్పు ప్రభావం



ఇటీవల వరుస తుఫాన్లు వచ్చిన కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లాలో అక్కడక్కడా మామిడి చెట్ల నిండా పూత వచ్చింది. వాతావరణ ప్రభావం కారణంగా పూత ఆలస్యమైంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పూత రాలేదని అధిక మొత్తంలో ఎరువులు, మందులు వినియోగిస్తే ఖర్చులు పెరిగిపోవడమేకాక నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
– రెడ్డయ్య,ఉద్యాన అధికారి, వేంపల్లె

పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం



కౌన్సెలింగ్ చేపడుతున్న ఆర్డీ రామగిడ్డయ్య

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో మంగళవారం జూనియర్ అసిస్టెంట్స్ నుంచి సీనియర్ అసిస్టెంట్స్ పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 9 మందికి గాను 8 మంది పదోన్నతులు పొందారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పదోన్నతులను కల్పించినట్లు తెలిపారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, వనిషా తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఈనెల 11 నుంచి సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయన కరపత్రాలను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. పోటీల్లో భాగంగా 11న ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు చుక్కల ముగ్గుల పోటీలను నిర్వహిస్తామని, 12న ఆదివారం కిశోర్ బృందం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. 13న భోగి మంటలు, కళా తరంగిణి బృందంచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. 14న సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 5 నుంచి గాలిపటాల ఎగురవేసే కార్యక్రమం, అనంతరం అనూష్ బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సంక్రాంతి సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ గంగిరెద్దు ఆటలను నిర్వహిస్తామన్నారు. 15న అఖిల్ బృందం వారిచే కామెడీ స్కిట్లు ప్రదర్శిస్తారన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనదలిచిన వారు 11వ తేది ఉదయం 9 గంటల నుంచి 10 గంటల్లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై తనిఖీలు

కడప కల్చరల్ : దేవదాయశాఖ పరిధిలో ఉన్న దేవాలయాలు, సత్రాలు, మఠాలు, ఇతర ఛారిటీ సంస్థలకు సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను దేవదాయశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం కడప నగరంలోని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ కార్యాలయంలో కర్నూలు ఉప కమిషనర్ గురుప్రసాద్ తనిఖీలు చేపట్టారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లన్నీ ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచుకోవాలని సూచించారు. వీటికి బ్యాంకు వడ్డీ సక్రమంగా జమ అవుతుందో లేదో కూడా ప్రతి మూడు మాసాలకు ఒకసారి పరిశీలించుకోవాలన్నారు. దేవాలయాల ఉద్యోగులంతా తప్పకుండా డ్రస్‌కోడ్ పాటించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, జిల్లాలోని అన్ని ఆలయాల ఈఓలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న కర్నూలు ఉప కమిషనర్ గురుప్రసాద్

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



పరుగు పోటీల్లో కానిస్టేబుల్ అభ్యర్థులు

కడప అర్బన్ : కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య (పీఎంటీపీఈటీ) పరీక్షలు 7వ రోజు కొనసాగాయి. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షించారు. మంగళవారం 600 మంది అభ్యర్థులకుగాను 442 మంది పరీక్షలకు హాజరయ్యారు. 274 మంది క్వాలిఫై అయ్యారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్ టీమ్, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ర్యాంకు.. అట్టడుగుకు

- స్థూల జిల్లా దేశీయోత్పత్తిలో 11వ ర్యాంకు
- జీఎస్‌డీపీలో జిల్లా వాటా 3.97 శాతం
- జిల్లా తలసరి ఆదాయం రూ. 2,09,084
- రాష్ట్రంలో 12వ ర్యాంకు



కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో అభివృద్ధి పడకేసింది. ప్రాథమిక రంగాలు తిరోగమన దిశలో ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు స్థూల జిల్లా దేశీయోత్పత్తిలో మంచి స్థానంలో ఉన్న జిల్లా ప్రస్తుతం 11వ ర్యాంకుకు పడిపోయింది. తలసరి ఆదాయంలో మిగతా జిల్లాలతో పోలిస్తే 12వ స్థానంలోకి దిగజారింది. జీడీడీపీలో మొదటి మూడు స్థానాల్లో వరుసగా విశాఖపట్టణం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. కోస్తా జిల్లాలతోపోలిస్తే రాయలసీమ జిల్లాలు బాగా వెనకబడి ఉన్నాయి. ప్రాథమిక రంగాల్లో వృద్ధిరేటు పడిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిల్లా విజన్ డాక్యుమెంటు (2024–29)లో మరెన్నో విస్తుపోయే నిజాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇక్కడ ఉన్న వాటినే అమరావతికి తరలిస్తుండడం దారుణమని పలువురు విమర్శిస్తున్నారు.

జీడీడీపీని జిల్లా అభివృద్ధికి కొలమానంగా భావిస్తారు. ప్రాథమిక రంగాలైన వ్యవసాయం, పరిశ్రములు, సర్వీసు సెక్టార్లను పరిగణలోకి తీసుకుని జీడీడీపీని రూపొందిస్తారు. స్థూల జిల్లా దేశీయోత్పత్తి రూ. 51,715 కోట్లుగా నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా కేటాయించిన ర్యాంకింగ్‌లో కడప 11వ స్థానానికి పరిమితం కావాల్సి వచ్చింది. రాష్ట్ర జీడీపీలో జిల్లా వాటా 3.97 శాతంగా ఉంది.

ఆయా రంగాల్లో వాటాలిలా..

జీడీడీపీలో వ్యవసాయరంగ వాటా 16,817 కోట్ల రూపాయలు. రాష్ట్రంలో ఈ వాటా 11వ స్థానంలో ఉంది. అలాగే పారిశ్రామికరంగ వాటా 12,975 కోట్లు. ఇది రాష్ట్రంలో 10వ ర్యాంకులో ఉంది. ఇక సర్వీసు సెక్టార్ విషయానికొస్తే 38.63 శాతం ఉంది. జీడీడీపీలో సర్వీసు సెక్టారు వాటానే అధికంగా ఉండడం గమనార్హం. ఇక జిల్లా తలసరి ఆదాయాన్ని పరిశీలిస్తే 2,09,084 రూపాయలుగా నమోదైంది. తలసరి ఆదాయంలో మిగతా జిల్లాలతో పోలిస్తే కడప 12వ ర్యాంకులో ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ విజన్ డాక్యుమెంటును పరిశీలిస్తే జిల్లాలో అభివృద్ధి ఎలా ఉందో అర్థమవుతోంది. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే నిర్మాణమైన ప్రాజెక్టుల కింద డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువలు ఏర్పాటు చేస్తే ఈ రంగం నుంచి జీడీడీపీలో వాటా మరింత పెరిగే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి స్టీల్ ప్లాంటు ఏర్పాటుపై చూపుతున్న శ్రద్ధ విభజన హామీల్లో భాగమైన కడప ఉక్కు పరిశ్రమపై చూపలేదు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో ఉన్న ఎంఎస్ఎంఈ టెక్నికల్ సెంటర్‌ను అమరావతికి తరలించింది. ఇలా జిల్లా పారిశ్రామికరంగ అభివృద్ధిపై ప్రభుత్వం కక్షగట్టిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కక్ష సాధింపు ధోరణిని మానుకుని జిల్లా వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై దృష్టిసారిస్తే జీడీడీపీతోపాటు ప్రజల తలసరి ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఏఈపై సబ్ ఇంజినీర్ దాడి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : డ్యూటీ విషయంలో తనను మందలించాడన్న అక్కసుతో ఓ సబ్ ఇంజినీర్ (ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి) ఏఈపై దాడి చేసిన ఘటన మంగళవారం బద్వేలులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. పట్టణ శివారులోని సిద్దవటం రోడ్డులో గల 132/33 కె.వి. సబ్‌స్టేషన్‌లో ఏఈగా బాలకృష్ణ అనే వ్యక్తి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే ఉపకేంద్రంలో నరసింహులు ఔట్‌సోర్సింగ్ విధానంలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే నరసింహులు విధుల్లో అలసత్వంగా ఉండటంతోపాటు రికార్డు సక్రమంగా నిర్వహించకపోవడంతో తరచూ ఏఈ మందలిస్తుండేవారు. ఇటీవల ఉన్నతాధికారుల నుంచి ఏఈకి షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో సబ్ ఇంజినీర్ వ్యవహారశైలిపై లిఖిత పూర్వకంగా ఏఈ ఫిర్యాదు చేశారు.

ఈ క్రమంలో మంగళవారం 'మీరు పని చేయని దానికి నేను మాటలు పడాలా' అంటూ సబ్ ఇంజినీర్ నరసింహులును ఏఈ బాలకృష్ణ మందలించారు. దీంతో కోపోద్రిక్తుడైన నరసింహులు ఉపకేంద్రం వెలుపలికి వచ్చి ఏఈ బయటికి వస్తున్న సమయంలో ఆయనపై విచక్షణా రహితంగా దాడి చేసినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఏఈ కళ్లజోడు పగిలిపోవడంతోపాటు ద్విచక్ర వాహనం నుంచి కిందపడినట్లు తెలిసింది. ఇంతలో ఉపకేంద్రం సిబ్బంది వచ్చి ఏఈని పక్కకు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఏఈ అర్బన్ పోలీసుస్టేషన్‌లో సబ్ ఇంజినీర్‌పై ఫిర్యాదు చేశారు. కాగా తాను ఏఈపై దాడి చేయలేదని, తనను విధుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తుండటంతో వాగ్వాదానికి దిగానని సబ్ ఇంజనీర్ చెప్పుకొస్తున్నారు. అయితే ఈ ఘటనలో పలువురు యూనియన్ నాయకులు జోక్యం చేసుకుని ఇరువురికి సర్దిచెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆలయ ప్రహరీ 3.09 ఎకరాల్లో నిర్మిస్తే అభ్యంతరం లేదు

- ఆక్రమణల వల్ల కుంచించుకుపోయిన స్థలం
- పార్కు, జిమ్ ఏర్పాటు చేస్తే దేవరకు తీవ్ర ఆటంకం
- తొక్కిసలాటలో ప్రాణనష్టం జరిగే అవకాశం
- అందుకే అభ్యంతరం తప్ప.. అభివృద్ధిని అడ్డుకోవడం కాదు
- జేసీకి పొట్లదుర్తి గ్రామస్తుల వినతి


జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న పోట్లదుర్తి గ్రామస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : పెద్దమ్మ ఆలయానికి చెందిన 3.09 ఎకరాల మొత్తం విస్తీర్ణం చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామ ప్రజలు కోరారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను కలిసి ఈ మేరకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నంద్యాల వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో వెలసిన పెద్దమ్మ దేవత ఆలయానికి 3.09 ఎకరాల స్థలం ఉందన్నారు. 2017లో ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వచ్చిందన్నారు. అయితే రెండు ఎకరాలు ఆక్రమణకు గురైందని పేర్కొన్నారు. మిగిలిన 1.09 ఎకరాల విస్తీర్ణంలో అప్పటి రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ 2023లో 95 లక్షల రూపాయల గ్రాంటు మంజూరు చేయించుకుని పార్కు, జిమ్, కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు సమాయత్తం అయ్యారని తెలిపారు. ఈ నెల 2వ తేదీన పనులు ప్రారంభించగా తాము అడ్డుకున్నామని, ఇది రాజకీయాలకు సంబంధం లేని అంశమని స్పష్టం చేశారు. గ్రామంలో ఫ్యాక్షన్ కారణంగా 80 ఏళ్ల క్రితం పెద్దమ్మ దేవర ఆగిపోయిందన్నారు. గత ఏడాది దేవర నిర్వహించగా, సుమారు 20 వేల మంది భక్తులు పాల్గొన్నారని తెలిపారు. ఇప్పుడున్న స్థలంలో జిమ్, పార్కు, కాంపౌండ్ వాల్ నిర్మిస్తే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. భవిష్యత్తులో దేవర నిర్వహిస్తే తీవ్ర తొక్కిసలాట జరిగి ప్రాణహాని చోటుచేసుకునే ప్రమాదముంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పనులను అడ్డుకున్నాం తప్ప అభివృద్ధికి తాము ఏనాడూ అడ్డుచెప్పలేదని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్లు, ట్యాంకులు, కాలువలు నిర్మించినపుడు తాము అడ్డుచెప్పలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎండోమెంట్ అనుమతి లేకుండా పార్కు ఎలా నిర్మిస్తారో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ చెప్పాలని ప్రశ్నించారు. గతంలో కుట్టుమిషన్లకు ఒక భవనాన్ని నిర్మించి తాళాలు మాత్రం సీఎం రమేష్ ఇంటిలో ఉంచుకున్నారని తెలిపారు. చెక్‌డ్యాము నిర్మించి ప్రొటెక్షన్ వాల్ సీఎం రమేష్ తోట లోపలి వైపు కాకుండా బయట నిర్మించారని తెలిపారు. ఇక మీదట సీఎం రమేష్ ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. దేవరకు సంబంధించిన కమిటీలో రెడ్లతోపాటు అన్ని కులాలను నియమించామని, ప్రజల నుంచి రూ.25 లక్షల చందాలు వసూలైందని పేర్కొన్నారు. తాము మిగతా వారికి వ్యతిరేకమైతే అంత డబ్బు వసూలు అవుతుందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు కాంపౌండ్ వాల్‌ను 3.09 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించాలన్నారు. ఈ అంశంపై తాము చట్టబద్ధంగానే ముందుకు వెళతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పడిగపాటి లక్ష్మిరెడ్డి, వెంకట శివారెడ్డి, వీరారెడ్డి, రామాంజనేయరెడ్డి, వెంకట సుదాకర్‌రెడ్డి, సారెడ్డి జయరామిరెడ్డి, పడిగపాటి శివశంకర్‌రెడ్డి, పి.సుబ్బారెడ్డి, నంద్యాల శివవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడప, నెల్లూరు జట్ల విజయం


వైఎస్‌ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో పోటీ పడుతున్న కర్నూలు, నెల్లూరు జట్లు


జాన్సన్, నెల్లూరు, 53 పరుగులు


భువనసాయి, చిత్తూరు, 54 పరుగులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-12 క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం కడప, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 140 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని యోగోష్‌సాయి 35, అరుణాచలం 29 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 33.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని జాన్సన్ 53, సోహన్‌లతిక్ 49 పరుగులు చేశారు. దీంతో నెల్లూరు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కడప జట్టుకు వరుసగా రెండో విజయం

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 35 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. జట్టులోని భువనసాయి 54, లిఖిత్‌రెడ్డి 36 పరుగులు చేశారు. కడప బౌలర్లు మోక్షజ్ఞ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 25.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని తాహీర్ 35, యోగాంజనేయులు 32, విష్ణువర్ధన్‌రెడ్డి 31 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది.

రెండు కొత్త కోర్సుల ఏర్పాటుకు సన్నాహాలు


మాట్లాడుతున్న ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలలో వచ్చే విద్యా సంవత్సరంలో రెండు కొత్త కోర్సులైన ఆర్టిఫిషియల్ లెర్నింగ్ (ఎ-ఐ), మిషన్ లెర్నింగ్ (ఎం.ఎల్) కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్జీయూకేటీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ తెలిపారు. మండలంలోని ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలను ఆయన ఆర్కే వ్యాలీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాతో కలిసి మంగళవారం పరిశీలించారు. అలాగే విద్యార్థులు, అధ్యాపకులతో వేర్వేరుగా కలిసి విద్య బోధనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో పీయూసీ-2 చదువుతున్న విద్యార్థులు ఎవరైనా పీయూసీ-1లో ఫెయిల్ అయింటే.. అలాంటి వారికి ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి రెమిడియల్స్ తరగతి గదులు నిర్వహించి, పరీక్షలకు పంపడం జరుగుతుందని చెప్పారు. పీయూసీ-2 పూర్తయ్యే సరికి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి ఇంజినీరింగ్ -1లో చేరే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త కోర్సుల ఏర్పాటు కోసం పీయూసీ, ఇంజినీరింగ్ కరికులమ్‌లో మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అకాడమిక్ డీన్, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్, ఆర్థిక అధికారితోపాటు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం పట్టివేత

ముగ్గురు నిందితుల అరెస్ట్


పట్టుకున్న మద్యం, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఇతర రాష్ట్రాలైన పుదుచ్చేరి, గోవాకు చెందిన మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. నగర శివార్లలోని శాటిలైట్ సిటీ వద్ద ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తమ సిబ్బందితో కలిసి దాడులు చేసి పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఒంటిమిట్టకు చెందిన వై.శివ, కమలాపురం మండలానికి చెందిన జి. వెంకటేష్, కడప నగరానికి చెందిన పి.మహేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడైన, కడప ఐటీఐ సర్కిల్‌కు చెందిన రఘురామిరెడ్డి పరారీలో ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి దాదాపు రూ.3 లక్షల విలువైన మద్యం బాటిళ్లు, అలాగే ఒక ఐచర్ వాహనం, టాటా లగేజీ ఆటో, ఇండికా కారు, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు సతీష్, నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

గోపవరం : మండలంలోని నెల్లూరు - ముంబై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-67) పై మంగళవారం కారు అదుపుతప్పి పక్కనే ఉన్న 33 కె.వి. విద్యుత్ లైన్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. జగదీశ్వర్‌రెడ్డి, అపర్ణ దంపతులు ఒంగోలు నుంచి స్వగ్రామమైన తాడిపత్రికి కారులో వెళుతుండగా.. గోపవరం మండలం ద్వారకానగర్ వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కారులోని ఎయిర్‌బెలూన్‌లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పి ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే సమాచారం అందుకున్న బద్వేలు రూరల్ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని స్థానికుల సహాయంతో బాధితులను బయటికి తీశారు. బద్వేలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారు తాడిపత్రికి వెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల ప్రారంభం

ఏయూ క్యాంపస్‌లో అంబరాన్ని అంటిన సంబరాలు


జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


ఏఐటీఎస్ సిల్వర్‌జూబ్లీ వేదికపై అలరించిన సంగీత నృత్యం

రాజంపేట : ఏఐటీఎస్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏయూ క్యాంపస్ ఆవరణలో అత్యంత సుందరోపేతంగా వేదికను నిర్మితం చేశారు. తొలిరోజు వేదికపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సి.రామచంద్రారెడ్డి, రాజంపేట ఎస్‌డీపీఓ సుధాకర్, ఏయూ ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలకు జ్యోతి ప్రజల్వన చేశారు. రజిత వేడుకలు అంబరాన్ని తాకాయి. అనంతరం సభను ఉద్దేశించి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ఏఐటీఎస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని రాజంపేట ప్రాంతానికే వన్నె తెచ్చిందన్నారు. ఉన్నత విద్యకు రాజంపేట ఒక వేదికగా మారింది అంటే అందుకు కారణం చొప్పా గంగిరెడ్డి అన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యాసమాజం బలోపేతం కావాలన్నదే ఏఐటీఎస్ లక్ష్యంగా కొనసాగిందన్నారు.


అలరించిన సంగీతం

ప్రఖ్యాత సంగీత కళాకారుడు రామ్ మ్యూజికల్ కన్సర్ట్ అలరించింది. మ్యూజికల్స్ వేడుకను విద్యార్థులు ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ నారాయణ, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జయరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ ఎం.సుబ్బారావు, డీన్స్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల వర్క్‌షాప్‌లను నిర్వహించారు. పరిశ్రమల పరిజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకత వంటి అంశాలలపై విద్యార్థులకు నిపుణులు అవగాహన కల్పించారు. వారిలో రెడ్డప్పనాయుడు, కిరణ్‌రావు, రమణారెడ్డి, మల్లాడి, రమేష్‌బాబు, భరద్వాజ్, జగదీశ్, నిహారిక, సుదీర్ సాంద్రాలు ఉన్నారు. పలు సంగీత కార్యక్రమాలు అలరించాయి.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వేముల : వేముల బస్టాండులో మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనం ఢీకొని గడ్డం బాబు (45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికుల కథనం మేరకు.. మండలంలోని గొందిపల్లె గ్రామానికి చెందిన గడ్డంబాబు సొంత పనుల నిమిత్తం వేములకు వెళ్లాడు. అక్కడ బస్టాండులో పని ముగించుకుని నడిచి వెళుతున్న బాబును పులివెందుల నుంచి ద్విచక్రవాహనంలో వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగివేమన విశ్వవిద్యాలయం మూడో దశ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. చదరంగం, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో నిర్వహించిన ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పించిన తర్వాతే వారి నుంచి పతకాలు ఆశించాలని సూచించారు. వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి జాతీయస్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు విశ్వవిద్యాలయం నగదు ప్రోత్సాహకంతోపాటు మార్కులు కేటాయించి ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గురివిరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మదన్‌మోహన్, క్లినికల్ సైకాలజిస్టు ఓ.వెంకటేశ్వర రెడ్డి, చెస్ రెఫరీ ఉమేష్, శ్రీకాంత్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.


మొక్కల నాటక ముందు...


మొక్కల నాటిన తర్వాత...





● అదర్ సైడ్


● శ్వేత

ఆమే వనమై...

ఎస్.పి గారి డ్యూటీ నేరాలను అరికట్టడం.
భూమి మీద చెట్టు చేమా
లేకుండా పోయేలా
మనిషి వహిస్తున్న నిర్లక్ష్యాన్ని మించిన
నేరం ఉంటుందా?
దానినీ అరి కట్టాలి కదా.
కామారెడ్డి జిల్లా ఎస్పీగా శ్వేత పనిచేస్తున్న
కాలంలో ఒక హరిత వనాన్ని పెంచడం
తన కర్తవ్యం అనుకున్నారు.
ఆరు ఎకరాల్లో ఎన్నో మొక్కలు నాటించారు.
ఇప్పుడది అడవిని తలపిస్తోంది.
హరిత రక్షక వనంగా నామకరణం చేసుకుంది.

హరితహారం స్ఫూర్తితో తన వంతు బాధ్యతగా మొక్కలను నాటడమే కాదు వాటిని సంరక్షించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగారు అప్పటి కామారెడ్డి ఎస్పీ శ్వేత. కామారెడ్డిలో ఆరు ఎకరాల స్థలంలో 80 రకాలైనవి ఎన్నో మొక్కలు నాటించారు. మొక్కలు నాటడమే కాదు వాటిని కాపాడేందుకు ఆమెతో పాటు పోలీసు సిబ్బంది నిరంతరం శ్రమించారు. ఫలితంగా ఇప్పుడు అక్కడ అడవిని తలపించే విధంగా చెట్లు పెరిగి పెద్దవయ్యాయి. మూడేళ్ల కాలంలో ప్రతీ రోజూ ఎస్పీ శ్వేత అక్కడికి వెళ్లేవారు. జరుగుతున్న పనులను పర్యవేక్షించేవారు. ప్రతీ రోజూ వాకింగ్, రన్నింగ్ అక్కడే చేసేవారు. ఈ వనానికి 'హరిత రక్షక వనం' అని నామకరణం చేశారు.

ఎనభై రకాల మొక్కలు...

స్థానికంగా పెరిగే అటవీ వృక్ష జాతులకు సంబంధించి దాదాపు 80 రకాల మొక్కలు నాటారు శ్వేత. రామ సీతాఫలం, బాదమ్, శ్రీగంధం, టేకు, ఖర్జూరం, వేప, పనస, నేరేడు, చింత, దానిమ్మ, జామ, ఈత, మేడి, మునగ, నిమ్మ, ఉసిరి, వెలగ, కుంకుడు, కదంబం, నల్లజీడి, రాచఉసిరి, జిట్రేగి... మొదలైన రకాలకు సంబంధించి ఎన్నో మొక్కలు నాటారు.

ప్రతీ మొక్కకు నీరందించడానికి డ్రిప్ ఏర్పాటు చేశారు. అక్కడ రెండు బోర్లు తవ్వించి వాటి ద్వారా నీటిని అందిస్తున్నారు. 'హరిత రక్షక వనం'లో రెండు నీటి గుంతలు తవ్వించారు. అందులో నీరు నిల్వ ఉండేలా వర్షపు నీరు ఆ గుంతలో నిండేలా ఏర్పాటు చేశారు. పై భాగాన ఉన్న గుంతలో పది అడుగుల మేర నీటి నిల్వ ఉంది. అందులో చేప పిల్లలను పెంచుతున్నారు. నీటిని నిల్వ చేయడం మూలంగా బోరుబావుల్లో భూగర్భ జల మట్టానికి ఇబ్బంది లేకుండాపోయింది.



ఆ శ్రమ వృథా పోలేదు...

'హరిత రక్షక వనం'లో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు శ్రమించారు. ఆ మొక్కలను తమ ఇంటి పెరట్లో నాటిన మొక్కలలాగే చూసుకున్నారు. మొక్కల చుట్టు పెరిగే గడ్డిని తొలగించడం, నీరు మొక్కకు చేరుతుందా లేదా చూసుకోవడం, పనికి రాని చెత్తను తొలగించడంలాంటి పనులెన్నో చేసేవారు. పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు జిల్లా పోలీసు కార్యాలయానికి వస్తే వారితో మొక్కలు నాటించేవారు. ఆ చెట్లకు వారి పేర్లతో నేమ్‌ప్లేట్లు ఏర్పాటు చేశారు.

'చెట్లు అంటే....భూమాత రాసిన కవిత్వం' అనేది భావుకతతో కూడిన మాటే కాదు బాధ్యతను గుర్తుకు తెచ్చే మాట.

వృత్తిబాధ్యత, సామాజిక బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పచ్చటి వనాన్ని సృష్టించడం కష్టమేమీ కాదు అని నిరూపిస్తున్నారు శ్వేత లాంటి అధికారులు.

- సేపూరి వేణుగోపాలచారి, సాక్షి, కామారెడ్డి

మానసిక స్థైర్యాన్ని ఇచ్చారు

శాంతిభద్రతలకు సంబంధించిన వ్యవహారాల్లో బిజీగా ఉంటూనే రకరకాల సామాజిక అంశాలపై స్పందించేవారు శ్వేత. కరోనా కాలంలో పోలీసు సిబ్బందిలో మానసిక స్థైర్యాన్ని కలిగించి ఎంతో మందికి అండగా నిలిచారు. నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం రాత పరీక్షలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. శారీరక ధారుఢ్య పరీక్షలకు శిక్షణ ఇప్పించారు.

అమ్మలాంటి చెట్టు

కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాల కోసం ఎంపిక చేసిన స్థలం దగ్గరికి వెళ్ళినప్పుడు ఈ స్థలం కనిపించి నాకు వనం పెంచాలన్న ఆలోచన వచ్చింది. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినపుడు అక్కడ వాతావరణం మారిపోతుంది. చల్లబడాలంటే సమాంతరంగా చెట్లు పెంచాలి. అందుకే 2017 దసరా రోజు నేను, అప్పటి కలెక్టర్ సత్యనారాయణ గారు ఇక్కడ మొక్కలు నాటాం. కామారెడ్డికి పోలీస్ ఉన్నతాధికారులు ఎవరు వచ్చినా వాళ్ళతో అక్కడ మొక్కలు నాటించాను. నాటడంతో పాటు మా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ వాటి సంరక్షణకు నిరంతరం శ్రమించారు. అక్కడి ఉసిరి చెట్టు దగ్గర మా అమ్మ ప్రతీ కార్తీక పౌర్ణమి రోజున పూజలు చేసి అందరికీ భోజనాలు పెట్టేవాళ్ళు. నేను బదిలీ అయినా ఒక అమ్మలా ఆ చెట్టు గుర్తుకొస్తూ ఉంటుంది.

- ఎన్. శ్వేత, ఐపీఎస్

● నృత్యోద్యమం



లండన్‌లో శివతాండవం

నాట్యం అనేది ఆహ్లాదానికే కాదు మానసిక వికాసానికి కూడా అనుకుంటే... నాట్యం అంటే సంతోషమే కాదు మానసిక స్థైర్యం కూడా అనుకుంటే... నాట్యం అనేది ఆనందతరంగమే కాదు పర్యావరణహిత చైతన్యం అంటే గుర్తుకు వచ్చే పేరు.... సోహిని రాయ్ చౌదరి....

సోహిని రాయ్ చౌదరి తండ్రి సుబ్రతో రాయ్ సితార్ విద్వాంసుడు. తల్లి ఉమా రాయ్ చౌదరి శిల్పి. కోల్‌కత్తాలోని వారి ఇంటిలో ఎప్పుడూ కళాత్మక వాతావరణం ఉండేది. నాలుగు సంవత్సరాల వయసులోనే నృత్యకారిణిగా కాళ్లకు గజ్జె కట్టింది సోహిని రాయ్ చౌదరి. భరతనాట్యం నుంచి మోహినియాట్టం వరకు ఎన్నో నృత్యాలలో ప్రావీణ్యం సాధించింది.

'మన వైదిక సిద్ధాంతాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవతావాదం, మంచి గురించి చాటి చెప్పాయి. కోవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధంలాంటి అనిశ్చిత కాలాల్లో అవి మనకు ధైర్యాన్ని ఇస్తాయి. ఇతరులకు సహాయపడేలా ప్రేరణ ఇస్తాయి. జీవితానికి సానుకూల దృక్పథాన్ని ఇచ్చే శక్తి మన పవిత్ర తత్వాలలో ఉంది' అంటుంది సోహిని.

వాతావరణ మార్పులపై ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో సదస్సులలో సోహిని రాయ్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వేదమంత్రాలతో కూడిన నా నృత్యప్రదర్శన ప్రకృతి గురించి, మన జీవితాల్లో దాని ప్రాముఖ్యత గురించి తెలియజేసేలా ఉంటుంది. పశుపతిగా శివుడు, అడవులు, జంతువులు, పర్యావరణాన్ని పరిరక్షించేవాడు. ప్రకృతిని మనుషులు ఎలా దుర్వినియోగం చేస్తున్నారో, విధ్వంసం సృష్టిస్తున్నారో చెప్పడానికి, ప్రకృతితో సన్నిహిత సంబంధాల కోసం శివతాండవం చేస్తున్నాను' అంటున్న సోహిని రాయ్ 'గ్లోబల్ ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ కూడా అందుకుంది.

ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళలు, సంస్కృతికి సోహిని రాయ్ చౌదరి అంబాసిడర్‌గా మారింది. యూకేలోని ఇండియన్ హైకమిషన్‌కు చెందిన నెహ్రూ సెంటర్‌లో సోహిని చేసిన శివతాండవం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శివతాండవంతో పాటు శివుడి గురించి రుషి దాస్ గుప్తా చెప్పిన విలువైన మాటలను వినిపించింది.

మార్కండేయ పురాణం, శివపురాణాలలో నుంచి ఒక కథను ఎంపిక చేసుకొని దాన్ని నృత్యరూపకంగా మలుచుకుంది. లండన్ తరువాత అమెరికా, రష్యా, జర్మనీ, స్పెయిన్... మొదలైన దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతోంది.


'డ్యాన్సింగ్ విత్ ది గాడ్స్' పేరుతో తొలి పుస్తకం రాసిన సోహిని రాయ్‌కు రచనలు చేయడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆమె రచనల్లో మహిళా సాధికారత నుంచి రంగస్థలం వరకు, నృత్యోద్యమం నుంచి దేవదాసీల దుస్థితి వరకు ఎన్నో అంశాలు ఉంటాయి.

శక్తివాదాన్ని ప్రధానంగా చేసుకొని ఎన్నో రచనలు చేసింది. 'ఇండియన్ స్టేజ్ స్టోరీస్: కనెక్టింగ్ సివిలైజేషన్స్' పేరుతో సోహినిరాయ్ రాసిన పుస్తకం భారతీయ రంగస్థలం ఆత్మను పట్టిస్తుంది. ఈ పుస్తకం ద్వారా మన నాగరికతలోని గొప్ప సాంస్కృతిక, సంప్రదాయల గురించి తెలియజేసే ప్రయత్నం చేసింది. యూరప్‌లోని పద్దెనిమిది యూనివర్శిటీలలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసింది.

'సూఫీ తత్వం, రూమీ కవిత్వం, ఠాగూరు మానవతావాదంలో నాకు మహిళాసాధికారత కనిపిస్తుంది' అంటున్న సోహినిరాయ్ చౌదరి తన నృత్య కళను సామాజిక ప్రయోజనం కోసం ఉపయోగిస్తోంది.


● సోహిని రాయ్ చౌదరి

● ముగ్గు ముచ్చట




నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల
17 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు, సరి చుక్కలు




సి. పుష్కల,
శ్రీనగర్ కాలనీ, కడప
17 చుక్కలు, 7 వచ్చేవరకు
మధ్య చుక్క



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

● గర్భసంచి

తొలగించడమే పరిష్కారమా?!

'ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్, జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు తాజాగా జర్నల్ ఆఫ్ మెడికల్ ఎవిడెన్స్ ద్వారా ఓ విషయాన్ని వెల్లడించారు. దేశంలోని 25 నుంచి 49 ఏళ్ల మధ్య వ్యవసాయ కూలీలుగా ఉన్న గ్రామీణ మహిళల్లో 32 శాతం గర్భసంచి తొలగింపు (హిస్టరెక్టమీ) శస్త్ర చికిత్సలు చేయించుకుంటున్నారని, ఈ శస్త్ర చికిత్సలు ప్రభుత్వ బీమా పథకాల ద్వారానే జరుగుతున్నాయని వెల్లడి అయింది. గర్భసంచి తొలగింపు శస్త్ర చికిత్సలవైపు గ్రామీణ మహిళలు ఎందుకు మొగ్గు చూపుతున్నారు?! ఏ అంశాలు వీరిని ప్రేరేపిస్తున్నాయి?! గర్భసంచి తొలగిస్తే వచ్చే నష్టమేమిటి?! అవగాహన అవసరం...

దేశంలో బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రాష్ట్రాల్లోని గ్రామాల్లో హిస్టరెక్టమీ రేటు పెరగడం ఆందోళన కలిగిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. అవగాహన లోపమే ఇందుకు ప్రధాన కారణం అంటున్నారు స్త్రీ వైద్య నిపుణులు. వారు చెబుతున్న విషయాలేంటంటే..

ఖర్చుకు భయపడి...

● వ్యవసాయ కూలీలుగా ఉన్న మహిళల్లో వ్యక్తిగత శుభ్రత తక్కువ. దీనివల్ల గర్భసంచికి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి.

● పోషకాహార లోపం వల్ల రక్తహీనత, అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్లు, రుతు సమయంలో వచ్చే నొప్పులను ఇంటిలో పనుల కారణంగా భరిస్తున్నారు. అయితే గర్భసంచి వాపు, సిస్టులు అనగానే క్యాన్సర్ అని భయపడుతున్నారు.

● సమస్య తీవ్రం అయినప్పుడు హాస్పిటల్‌కు రావడం, త్వరగా నయం కాకపోవడంతో పదే పదే డాక్టర్ దగ్గరకు వెళ్లవలసి వస్తుందని, దీనివల్ల ఇంటి పనులు, కూలి పనులకు ఇబ్బందులు వస్తాయని, తమ వెంట వచ్చేవారి పని కూడా పోతుందని, టెస్టులకు, మందులకు అదనపు ఖర్చు అని.. 'గర్భసంచి తొలగించుకుంటే' ఈ చికాకులన్నీ పోతాయనే ఆలోచనకు వస్తున్నారు.

● శస్త్ర చికిత్సకు ప్రభుత్వం అందించే ఉచిత పథకాల కోసం వెతుకుతున్నారు.

● గర్భసంచి సమస్యలను వాయిదా వేసుకుంటూ కూలి పనులు ఎక్కువ ఉండని వేసవి కాలాన్ని ఆపరేషన్‌కు కేటాయించుకుంటున్నారు.

● త్వరగా పెళ్ళిళ్లు అవడం, పిల్లలు పుట్టడం, త్వరగా గర్భసంచి తొలగించుకోవడం అనేది గ్రామాల్లో కూలి పనులకు వెళ్లే వారిలో తరచూ కనిపిస్తోంది.

అత్యవసర అవగాహన

● శుభ్రతకు సంబంధించిన అవగాహన అత్యవసరం.

● అధిక రక్తస్రావం సమస్యలకు కూడా పరిష్కారాలు ఉన్నాయి. హార్మోన్లకు, బలానికి వాడే మందులను అందజేయాలి.

● తప్పనిసరై గర్భసంచి తొలగించుకున్నా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే రకరకాల ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీంతో మళ్లీ హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. మధుమేహం, బలహీనత, ఎముకల సమస్యలు... వీటన్నింటి పైనా అవగాహన కల్పించాలి.

ఆర్థికంగానే కాదు ఆరోగ్యంగా ఉండటమూ దేశ భవిష్యత్తుకు కొలమానమే. వ్యవసాయ కార్మికులుగా ఉన్న మహిళలు తరచూ పురుగు మందులకు గురి కావడం వల్ల కూడా అధిక రుతుస్రావాలు, ఫైబ్రాయిడ్లు, గర్భాశయ లోపాలు, జననేంద్రియ సమస్యలకు కూడా గురవుతున్నారని నివేదికలు తెలియజేస్తున్నాయి.

- నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏడాదికోసారి పాప్‌స్మియర్ టెస్ట్

గర్భసంచి తొలగించడం వల్ల అండాలు విడుదల కాక హార్మోన్ల పని తీరు దెబ్బతింటుంది. దీనివల్ల ఎముకలపై ప్రభావం పడి, త్వరగా కీళ్ల సమస్యలు వస్తాయి. చాలా మందిలో రకరకాల ఇన్ఫెక్షన్ల వల్ల గర్భసంచి వాపు వస్తుంది. ఫైబ్రాయిడ్స్, సిస్టులు వస్తుంటాయి. అయితే అవగాహన లేక క్యాన్సర్ వస్తుందేమో అనే భయంతో గర్భసంచి తీసేయమని కోరుతున్నారు. పాప్‌స్మియర్ స్క్రీనింగ్‌తో గర్భసంచి సమస్య ఏంటో ముందే తెలుసుకోవచ్చు. దానికి తగిన మందులు వాడితే సరిపోతుంది. 40 ఏళ్ల లోపు మహిళలకు గర్భసంచి తొలగించకపోవడమే మంచిది. హెల్త్ అవేర్‌నెస్ క్యాంప్స్, ఏడాదికోసారి పాప్ స్మియర్ టెస్టులు, కుటుంబం మొత్తానికి స్త్రీ ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.



- డాక్టర్ భానుప్రియ, గైనకాలజిస్ట్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్, నిజామాబాద్



అడ్డంకిగా భావిస్తున్నారు

గ్రామీణ మహిళలు ఓవర్ బ్లీడింగ్, వైట్ డిశ్చార్జ్, ఇన్ఫెక్షన్స్ వంటి సమస్యలతో మా దగ్గరకు వస్తుంటారు. ఇలాంటప్పుడు టెస్టులు చేయించుకోవడం మందులు వాడటం, పదే పదే వైద్యులను సంప్రదించడం వారికి కష్టంగా మారుతుంది. అందుకు గర్భసంచి తొలగించుకోవడం మేలేమో అనే ఆలోచన చేస్తున్నారు. సాధారణంగా 50 ఏళ్లలో మెనోపాజ్ లక్షణాలు కనిపిస్తాయి. సర్జికల్‌గా వచ్చే మెనోపాజ్ వల్ల చెమటలు పట్టడం, అలసిపోవడం, చిరాకు, హాట్ ఫ్లషెస్.. అన్నీ ముప్పైల్లోనే కనిపిస్తాయి.



- డాక్టర్ మనోరమ, మధిర, ఖమ్మం జిల్లా

లీగల్

నిరాశ పడద్దు... మీకు న్యాయం జరుగుతుంది

మా ఇంటి పక్కన వారు మా ఇంటికి అనుకొని ఎలాంటి అనుమతి లేకుండా వారి పెంట్‌హౌస్ కట్టుకుంటున్నారు. ఆ పెంట్‌హౌస్ కట్టడం వలన మా ఇంటిలోకి వెలుతురు రావడం ఆగిపోతుంది. వారు పెంట్ హౌస్ కట్టుకోవడానికి అనుమతి కూడా లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇల్లు మా ఇష్టం, నీ కెందుకు సమాధానం చెప్పాలి అని గొడవ పడుతున్నారు. కాలనీ అసోసియేషన్ వారు మాట్లాడినా లాభం లేకుండా పోయింది. ఏం చేయాలో సలహా ఇవ్వగలరు.

- పవన్ కుమార్, హైదరాబాద్

ముందుగా మీరు వ్యక్తిగతమైన వాగ్వాదానికి చోటు ఇవ్వకండి. అది సరైనది కాదు, దాని వల్ల వివాదం పెరుగుతుందే తప్ప తగ్గదు! ఎవరి ఇంటిలో వారు నిర్మాణాలు చేసుకోవచ్చు కానీ అది పక్కవారికి ఇబ్బంది కలగకుండా, పక్కవారి హక్కులకు భంగం కలగకుండా ఉండాలి. అంతేకాక, చట్టరీత్యా నిబంధనలకు లోబడి ఉండాలి. సరైన అనుమతి లేకుండా నిర్మించే ఎలాంటి కట్టడమైనా అక్రమ కట్టడంగానే పరిగణించబడుతుంది. చట్టరీత్యా చర్యలు తీసుకుంటే అలాంటి అక్రమ కట్టడాలను తొలగించాల్సి వస్తుంది. మీరు వెంటనే మునిసిపల్ అధికారులకు ఒక ఫిర్యాదు చేయండి. అందులో మీకు కలిగే నష్టం ఏమిటి, మీ పక్కింటి వారు చేస్తున్న అక్రమ నిర్మాణం ఏమిటి, ఎందుకని ఆ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణం అని మీరు అంటున్నారు వంటి విషయాలను ప్రస్తావిస్తూ రాయండి. నేరుగా వెళ్తే అధికారులు మీ ఫిర్యాదు తీసుకోలేము అనటం సహజంగా చూస్తుంటాం. అందుకే రిజిస్టర్డ్ పోస్టు ద్వారా మీ ఫిర్యాదును పంపించవచ్చు. సరైన వ్యవధిలో అధికారులు చర్యలు తీసుకోకపోతే, మీరు హైకోర్టును కూడా ఆశ్రయించి మీ ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలి అని హైకోర్టు ఆర్డరు పొందవచ్చు. అలా చేయడం ద్వారా అధికారులు సదరు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిజానిజాలు తేల్చిన తర్వాత తొలగించే చర్యలను చేపడతారు. అయితే, కోర్టు కేసులలో కొంత ఆలస్యం జరగవచ్చు. దానికి నిరాశ పడవలసిన అవసరం లేదు. చట్టరీత్యా మీకు న్యాయం జరుగుతుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● బ్యూటిప్స్



కురుల చివరలు చిట్లుతుంటే...

చలికాలం చర్మ ఆరోగ్యాన్నే కాదు శిరోజాల సహజత్వాన్ని కాపాడుకోవాలి. లేదంటే వెంట్రుకలు పొడిబారడం, చిట్లడం, చుండ్రు సమస్య తలెత్తడం వంటివి చూస్తుంటాం. ఈ సమస్యకు పరిష్కారంగా...

అలెవెరాతో కండిషనింగ్

షాంపులు, కాలుష్యం, గాలిలో తేమ తగ్గడం.. వంటి వాటి వల్ల ఈ కాలంలో వెంట్రుకలు త్వరగా పొడిబారడం, చిట్లడం వంటివి సహజంగా జరుగుతుంటాయి. వీటి వల్ల జుట్టు నిస్తేజంగా కనిపిస్తుంది. రసాయనాల గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసిన తర్వాత అలోవెరా జెల్‌ను జుట్టుకు పట్టించాలి. 15-20 నిమిషాల తర్వాత నీటితో కడిగేయాలి. అలోవెరా రసం జుట్టుకు కావలసినంత కండిషన్ లభించేలా చేస్తుంది.

ఉసిరితో మృదుత్వం

ఉసిరి, మందారపువ్వులు మరిగించిన కొబ్బరినూనెతో మాడుకు, వెంట్రుకలకు రాసి, మర్దనా చేయాలి. మరునటి రోజు ఉదయం తలస్నానం చేయాలి. ఈ విధంగా చేస్తే వెంట్రుకలు చిట్లడం సమస్య తగ్గుతుంది. కురుల మృదుత్వం పెరుగుతుంది.